“కాదు. తల్లిదండ్రులని ఎదిరించి, కులాన్ని మతాన్ని కాదని నన్ను చేసుకున్నప్పుడున్న ధైర్యం సిగరెట్ మానేయడంలో లేదనకు. నువు నాక్కాదు సిగరెట్‌కి బానిసని” చెప్పింది చిన్నగా నిట్టూర్చి.

## సెవెన్టీ ఎం. ఎం. దోసె

“సెవెన్‌టీ ఎమ్. ఎమ్. దోసె” చెప్పింది అహ్లూవాలియా భార్య సరిత రెస్టారెంట్‌లోని బేరర్‌కి.

“నాక్కూడా అదే” అహ్లువాలియా చెప్పాడు.

“పొడుగ్గా, కాగితంలా సన్నగా భలే వుంటుంది నాకెంతో ఇష్టం” భర్త మొహంలోని భావాలని పసిగట్టి చెప్పింది సరిత.

వారిద్దరికీ వివాహం అయి నాలుగురోజులైంది. హనీమూనుకి వూటీకి వచ్చారు. మూడు రోజులు అక్కడ గడిపి తర్వాత గోవా వెళ్తున్నారు.

అహ్లూవాలియా నార్ ఇండియన్ గడ్డం, మీసం నాలుగు సంవత్సరాల నించీ వుంది. వారిద్దరిదీ ప్రేమ వివాహం.

ఆరాత్రే వారి మొదటి రాత్రి.

రేస్‌కోర్స్ వెనకవున్న వుడ్‌లాండ్స్ హోటల్లో ఆ నూతన దంపతుల తొలిరాత్రి గడిచింది.

మర్నాడు వుదయం అహ్లూవాలియా బాత్‌రూంలోకి వెళ్తుంటే సరిత చెప్పింది.

“డార్లింగ్ నాదో చిన్న కోరిక”

“ఏమిటి?” అడిగాడు.

“గడ్డం తీసేయరాదూ? గుచ్చుకుంటుంటే ఎంతో ఇబ్బందిగా వుంది”

కొన్ని క్షణాలు ఆలోచించాడు అదంటే అతనికి ఎంత మక్కువ అయినా, తన భార్య తొలికోరికని కాదనలేక పోయాడు.

సెలూన్‌కి వెళ్ళి గడ్డం తీయించేసాడు ఉదయం మళ్ళీ అదే రెస్టా రెంట్‌కి బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్ళారు.

ఇదరికీ మళ్ళీ సెవెన్టీ ఎం. ఎం. దోసె చెప్పింది సరిత తనవంక బేరర్ అదోలా చూడటం గమనించింది సరిత కారణం భోధపడలేదు.

ఆరోజు బొటానికల్ గార్డెన్స్‌లో కాసేపు, వూటీలేక్‌లో బోటింగ్ చేస్తూ కాసేపు గడిపారు.

మొదటిరాత్రి నిద్రలేదు కాబట్టి ఆరోజుమధ్యాహ్నంమూడుగంటలకి హోటల్‌కి చేరుకుని పడుకున్నారు.

మర్నాడు వుదయం బాత్‌రూంలో అద్దంలో తన మొహం చూసు కున్నాడు అహ్లావాలియా వెంటనే సెలూన్‌కి వెళ్ళి మీసాన్ని కూడా తీయిం చేసుకున్నాడు.

మూడోరోజు వుదయం కూడా సరిత సెవెన్టీ ఎం. ఎం. దోసె ఆర్డర్ చేసింది ఆరెస్టారెంట్‌లో.

"రెండు సెవెన్టీ ఎం ఎం దోసె" బేరర్ వంట గదిలోని వంట వాడితో చెప్పాడు.

"ఆ అమ్మాయేనా?" అడిగాడు వంటవాడు.

"అవును, ఇవాళ మూడోవాడ్ని తీసుకొచ్చింది. పోలికల్నిబట్టి ఆ ముగ్గులూ అన్నదమ్ములనిపిస్తోంది. ఇలా ముగ్గురితో, అందులో అన్న దమ్ములతో సన్నిహితంగా వుండే ఆమె ఎంత జాణ!" ఈసడింపుగా చెప్పాడు బేరర్.